క్లుప్తంగా

దొంగతనం కేసును ఛేదించిన పోలీసులు

కె.గంగవరం: గత ఏడాది కుందూరులో జరిగిన బైక్ దొంగతనం కేసులో కె.గంగవరం పోలీసులు చాకచక్యంగా వ్యవహరించి ముద్దాయిని అరెస్టు చేసి కోర్టుకు తరలించారు. కె.గంగవరం ఎస్సై జానీబాషా తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని కుందూరులో గత ఏడాది ఆగస్టు 28న మణికంఠ ఇంటి ముందు లాక్ చేసి ఉంచిన రాయల్ ఎన్ఫీల్డ్ మోటార్ సైకిల్ ఉదయానికి కనిపించకపోవడంతో స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదుని పరిగణనలోకి తీసుకుని కేసు నమోదు చేసి కె.గంగవరం పోలీసులు దర్యాప్తు నిర్వహించారు. సాంకేతిక పరిజ్ఞానం ద్వారా చాకచక్యంగా వ్యవహరించి సదరు బైక్‌ను అపహరించిన సురేంద్రను కాకినాడలో మంగళవారం అరెస్ట్ చేసి అతని వద్ద నుంచి రూ.లక్ష విలువైన రాయల్ ఎన్ఫీల్డ్ బైక్‌ను స్వాధీనం చేసుకుని జ్యుడీషియల్ రిమాండ్ కోసం రామచంద్రపురం కోర్టుకు పంపించారు. ఈ కేసులో చాకచక్యంగా వ్యవహరించి ముద్దాయిని అరెస్ట్ చేసిన ఎస్సై జానీబాషా, క్రైం పార్టీ హెడ్‌కానిస్టేబుల్ ఈశ్వరరావు, కె.సతీష్, టీవీ లక్ష్మణ్ బాబు, కామేశ్వరరావులను జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు ప్రత్యేకంగా అభినందించారు.

సమాచార హక్కు చట్టం బలమైన ఆయుధం



టేకిలోని రైతు సేవా కేంద్రంలో ఆర్టీఐపై అవగాహన కల్పిస్తున్న రమేష్‌కుమార్

కపిలేశ్వరపురం: సమాచార హక్కు చట్టం -2005 (ఆర్టీఐ) ప్రజల చేతిలో బలమైన ఆయుధమని మండల వ్యవసాయాధికారి కేవీఎస్ రమేష్‌కుమార్ తెలిపారు. టేకి రైతు సేవా కేంద్రంలో బుధవారం మండలస్థాయి అవగాహన సదస్సు నిర్వహించారు. రమేష్‌కుమార్ మాట్లాడుతూ ఆర్టీఐ ద్వారా ప్రభుత్వ శాఖల పరిధిలోని సమాచారాన్ని నిర్దేశించిన నియమ నిబంధనలు మేరకు పొందవచ్చన్నారు. వ్యవసాయ శాఖ ద్వారా అమలు చేస్తున్న పథకాలు, సాగు పద్ధతులపై రైతులు సమాచారాన్ని పొందడం వచ్చన్నారు. వ్యవసాయశాఖ సబ్ డివిజన్ స్థాయిలో సహాయ వ్యవసాయ సంచాలకులు పబ్లిక్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్‌గా వ్యవహరిస్తారన్నారు. సబ్ డివిజన్ పరిధిలోని మండల వ్యవసాయధికారులు అసిస్టెంట్ పబ్లిక్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్‌గా సమాచారాన్ని అందిస్తారన్నారు. సదస్సులో సచివాలయ వ్యవసాయ సహాయకులు, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

32 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు



గర్భిణులకు అవగాహన కల్పిస్తున్న మల్లికార్జునుడు

కపిలేశ్వరపురం: అంగర పీహెచ్‌సీలో బుధవారం 32 మంది గర్భిణులకు ఉచితంగా వైద్య పరీక్షలు చేశారు. సీనియర్ గైనకాలజిస్ట్ కె.కన్యాకుమారి గర్భిణులను పరీక్షించి పలు జాగ్రత్తలను సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవాల ప్రాధాన్యతపై వైద్యాధికారి డాక్టర్ పీఎస్ఎస్‌డీ రత్నకుమారి వివరించారు. గర్భిణులు తీసుకోవాల్సిన ఆహారంపై ఎంపీహెచ్ఈఓ జిత్తుక మల్లికార్జునుడు, హెచ్ఈ బి.రామారావు అవగాహన కల్పించారు. శిబిరంలో పీహెచ్‌సీ హెల్త్ విజిటర్ టి.మేరీ మణి, ల్యాబ్ టెక్నీషియన్ ఆలీ, వైద్య ఆరోగ్య, కార్యకర్తలు సేవలందించారు. సర్పంచ్ తిరునాతి ఆదిలక్ష్మి, నాయకులు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఆసుపత్రిలో నూతనంగా ప్రారంభించిన బలుసు రుద్రయ్య మెమోరియల్ టస్టు నూతన బ్లాక్‌లో అందిస్తున్న వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

డంపింగ్ యార్డు పరిశీలన



సంఘం పుంత రోడ్డులోని డంపింగ్ యార్డును పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ దుర్గారాణి

మండపేట: డంపింగ్ యార్డులో పెరిగిన చెత్తను రోడ్డు మీదకు రాకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి అధికారులకు సూచించారు. 24వ వార్డు సంఘం పుంత రోడ్డులోని డంపింగ్ యార్డ్‌ను బుధవారం కమిషనర్ టీవీ రంగారావుతో కలిసి సందర్శించారు. రోడ్డు వరకూ వచ్చిన చెత్తను జేసీబీ సాయంతో యార్డు లోపలకు తరలిస్తున్న పనులను ఆయన పరిశీలించారు. స్థానిక ప్రజలకు, ఈ రోడ్డు మీదుగా రాకపోకలు సాగించే వాహన చోదకులకు ఇబ్బంది రాకుండా ఎప్పటికప్పుడు చెత్తను శుభ్రం చేయాలన్నారు. అనంతరం అక్కడి నుంచి 8వ వార్డు పరిధిలోని ఇందిరాగాంధీ బైపాస్ రోడ్డులోని శ్మశాన వాటిక చుట్టు పక్కల రెండ్రోజుల క్రితం చేపట్టిన పిచ్చి మొక్కలు, తుప్పల తొలగింపు పనులను ఆమె పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. చైర్‌పర్సన్ వెంట 8వ వార్డు కౌన్సిలర్ మందపల్లి రవికుమార్, ఇన్‌చార్జ్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ ముత్యాల సత్తిరాజు ఉన్నారు.

ఇంకా ఇన్‌చార్జిల పాలనేనా?

- గతంలో అరకొరగా పంచాయతీ కార్యదర్శులు
- వైఎస్సార్ సీపీ హయాంలో గ్రేడ్-5 పంచాయతీ కార్యదర్శుల నియామకం
- ప్రతి పంచాయతీకి పూర్తి స్థాయి కార్యదర్శిని నియమించే అవకాశం

మండలం	పంచాయతీలు	పంచాయతీ కార్యదర్శులు	ఇన్‌చార్జిల పాలనలో ఉన్న పంచాయతీలు
రామచంద్రపురం	25	21	4
కె.గంగవరం	26	20	6
కాజులూరు	26	26	0
మండపేట	12	12	0
రాయవరం	19	16	3
కపిలేశ్వరపురం	19	14	5



ద్రాక్షారామ పంచాయతీ కార్యాలయం (ఫైల్)

రామచంద్రపురం రూరల్: గ్రామ పరిపాలనలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నూతన శకానికి నాంది పలికింది. ప్రభుత్వ పథకాల కోసం మండల స్థాయి కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పని లేకుండా పరిపాలనను గ్రామ స్థాయికి తెస్తూ గ్రామ సచివాలయాలను ఏర్పాటు చేసి ప్రతి సచివాలయంలోనూ 10 మంది వివిధ శాఖలకు అధికారులను కొత్తగా ఉద్యోగాలు ఇచ్చి నియమించింది. దీనిలో భాగంగా గ్రేడ్-5 పంచాయతీ కార్యదర్శులను రామచంద్రపురం నియోజకవర్గంలో 38 మందిని, మండపేట నియోజకవర్గంలో 28 మందిని 2019లో నియమించారు. దీంతో ప్రస్తుతం పంచాయతీ కార్యదర్శుల కొరత తీరి ప్రతి గ్రామానికి ఒక్కో పంచాయతీ కార్యదర్శిని నియమించడానికి అవకాశం కలిగింది. అయినప్పటికీ ఇంకా కొన్ని పంచాయతీల్లో వివిధ కారణాలతో ఇన్‌చార్జుల పాలన కొనసాగించడంపై ప్రజలు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.

వివిధ మండలాల్లో పరిస్థితి ఇలా..

ఉదాహరణకు రామచంద్రపురం మండలంలో ద్రాక్షారామ మేజర్ పంచాయతీగా ఉంది. సుమారు 8 వేలకు పైగా జనాభా ఉంది. ఈ గ్రామంలో రెండు గ్రామ సచివాలయాలు ఉన్నాయి. పంచాయతీ సర్పంచ్‌తో పాటు, 14 మంది వార్డు సభ్యులు ఉన్నారు. ఇద్దరు ఎంపీటీసీలు ఉన్నారు. ఆ ఇద్దరిలో ఒకరు మండల ప్రజా పరిషత్ ఉపాధ్యక్షురాలిగా ఉన్నారు. ద్రాక్షారామకు ప్రస్తుతం పూర్తి స్థాయి కార్యదర్శి లేరు. వెలంపాలెం పంచాయతీ కారదర్శిని ఇన్‌చార్జిగా నియమించారు. కె.గంగవరం మండలంలో 6 పంచాయతీలు శివల, మసకపల్లి, సుందరపల్లి, పాణింగపల్లి, గుడిగళ్లబాగ, తామరపల్లి గ్రామాలకు ఇతర పంచాయతీల కార్యదర్శులను ఇన్‌చార్జిలుగా నియమించారు. కపిలేశ్వరపురం మండలంలో 5 గ్రామాలకు రెగ్యులర్ కార్యదర్శులు లేరు. దీంతో వెదురుమూడి పంచాయతీకి జూనియర్ అసిస్టెంట్‌కు కార్యదర్శి బాధ్యతలు అప్పగించారు. కేదారిలంక, అద్దంకివారిలంక, నల్లూరు, వడ్లమూరు పంచాయతీలకు ఇతర గ్రామాల కార్యదర్శులను ఇన్‌చార్జిలుగా నియమించారు. రాయవరం మండలంలోని మూడు గ్రామాలు లొల్ల, మాచవరం-2, నదురుబాద పంచాయతీలకు ఇన్‌చార్జిలు నియమించారు. ఏ పంచాయతీకి ఆ పంచాయతీ కార్యదర్శి అందుబాటులో ఉంటే ప్రజా సమస్యల పరిష్కారం త్వరితగతిన జరగడమే కాకుండా ఆయా కార్యదర్శులకు గ్రామాల పట్ల పూర్తి స్థాయి అవగాహన, పట్టు ఉంటుంది. అందువల్ల ఇన్‌చార్జిల పాలన తప్పించి పూర్తి స్థాయిలో కార్యదర్శులను నియమించాలని ప్రజలు కోరుతున్నారు.

గ్రామాభివృద్ధికి విఘాతం



ప్రతి గ్రామానికి పూర్తి స్థాయిలో పంచాయతీ కార్యదర్శి లేకుంటే గ్రామ అభివృద్ధికి విఘాతం కలుగుతుంది. గ్రామంలో ప్రతి పని ముందుకు సాగాలంటే అటు పంచాయతీ పాలకవర్గంతో పాటు పంచాయతీ కార్యదర్శి అందుబాటులో ఉండాల్సిన అవసరం ఉంది. పాలనా వ్యవహారాలు అన్నీ పంచాయతీ కార్యదర్శి సంతకాలతోనే ముందుకు సాగుతాయి కాబట్టి ఇన్‌చార్జిలు అయితే తమ పంచాయతీకి, ఇన్‌చార్జి చేసే చోట పూర్తి స్థాయిలో అందుబాటులో ఉండే అవకాశం ఉండదు కాబట్టి ప్రతి పంచాయతీకి పూర్తి స్థాయిలో అందుబాటులో ఉండేలా కార్యదర్శులను నియమించాలి. – నరాల రాజ్యలక్ష్మి, వైస్ ఎంపీపీ, రామచంద్రపురం మండలం

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతా..



ప్రతి పంచాయతీకి కార్యదర్శిని నియమించాల్సి ఉన్నా కార్యదర్శులు లేక కొన్ని చోట్ల ఇన్‌చార్జులను నియమించాల్సి వచ్చింది. తమ పంచాయతీలకు పూర్తి స్థాయిలో కార్యదర్శులను నియమించాలన్న ప్రజల డిమాండ్‌ను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుని వెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తాం. – కదలి పద్మజ్యోతి, ఎంపీడీఓ, రామచంద్రపురం మండలం

అమరవీరుల త్యాగాలను ఆదర్శంగా తీసుకోవాలి



పోలీసు అమరవీరులకు నివాళులర్పిస్తూ గొల్లపాలెంలో ర్యాలీ నిర్వహిస్తున్న స్థానిక నాయకులు, విద్యార్థులు, పోలీసు సిబ్బంది

కాజులూరు: పోలీసు అమరవీరుల త్యాగాలను యువత ఆదర్శంగా తీసుకోవాలని బందనపూడి గ్రామ సర్పంచ్ డేగల తిరుమలవేణి అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా బుధవారం మండలంలోని పలు గ్రామాలకు చెందిన స్థానిక నాయకులు, పలు కళాశాలల విద్యార్థులు ఆర్యావటం కోళ్లతూము సెంటరు నుంచి గొల్లపాలెం పోలీస్టేషన్ వరకూ ర్యాలీ నిర్వహించారు. ఎస్సై ఎం.మోహన్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన సభలో ఆమె మాట్లాడుతూ విధి నిర్వహణలో ప్రజల కోసం ప్రాణాలు అర్పించిన పోలీసుల జ్ఞాపకార్థం ఏటా పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలు నిర్వహిస్తున్నారని పోలీసు లేని సమాజాన్ని ఊహించుకోవటానికి కూడా కష్టంగా ఉంటుందన్నారు. అనంతరం ఎస్సై మోహన్‌కుమార్ అమరులైన పలువురి జీవిత చరిత్రలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో మండల గౌడ సంఘం అధ్యక్షుడు అంగర కృష్ణ, ఆర్యావటం మాజీ సర్పంచ్ కోట తాతబ్బాయి, జేఏసీ నాయకులు రవితేజ, ఖండవిల్లి శ్రీనివాసరావు, పెంకే అప్పారావు, స్టేషన్ సిబ్బంది వీరబాబు, రమణ, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

కపిలేశ్వరపురం: అంగరలో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే వేగుళ్ల బుధవారం శంకుస్థాపన చేశారు. పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా గ్రామంలో ఆయన పర్యటించారు. 15వ ఆర్థిక సంఘం, ఎంజీఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.70.28 లక్షలతో అభివృద్ధి పనులను చేపట్టనున్నామన్నారు. రెండు గోకులాల నిర్మాణాలకై ఇద్దరు పాడి రైతులకు రూ.4.15 లక్షలు మంజూరయ్యాయన్నారు. రూ.43.38 లక్షల వ్యయంతో 15,240 మీటర్ల మేర పంట కాలువల పునరుద్ధరణ పనులను చేపట్టనున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వాసా కోటేశ్వరరావు, ఉప సర్పంచ్ యర్రా వీరన్నబాబు, ఎంపీటీసీ మేడిశెట్టి దుర్గారావు, నాయకులు పుత్సల శ్రీనివాస్, త్రిమూర్తులు పాల్గొన్నారు.

పడమర ఖండ్రికలో..

కపిలేశ్వరపురం: రెవెన్యూపరమైన సమస్యలను సంబంధిత అధికారులు నిర్దేశించిన సమయంలోపు పరిష్కరించేలా చర్యలు తీసుకున్నట్లు ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు తెలిపారు. మండలంలోని పడమర ఖండ్రికలో బుధవారం భూముల రీసర్వే గ్రామ సభను నిర్వహించారు. సభలో భూ యాజమానులు తమ సమస్యలపై దరఖాస్తులను తహసీల్దార్ చిన్నారావుకు అందజేశారు. కార్యక్రమంలో రెవెన్యూ అనుబంధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

తడి, పొడి చెత్తపై అవగాహన కల్పించాలి



సమావేశంలో ఆర్పీలకు సూచనలు చేస్తున్న కమిషనర్ రంగారావు

మండపేట: మున్సిపల్ పరిధిలోని 30 వార్డుల్లోని ప్రజలకు తడి, పొడి చెత్తను వేరుచేసే విధానంపై చైతన్యం తీసుకురావాలని కమిషనర్ టీవీ రంగారావు మెప్మా రీసోర్స్ పర్సన్లను ఆదేశించారు. దీనిపై బుధవారం కార్యాలయంలో కౌన్సిల్ హాలులో ఆర్పీలతో సమావేశంలో నిర్వహించారు. తడి,పొడి చెత్తను వేరుచేసే విధానంపై పట్టణ ప్రజలకు నిరంతరం అవగాహన కల్పించాలని అన్నారు. ఈ విధానంపై ప్రజల్లో పూర్తిగా చైతన్యం వచ్చే వరకూ విశ్రమించవద్దని ఆర్పీలకు సూచించారు. ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిషేధించాలని ప్రజలకు వివరించాలన్నారు. ప్రతి ఇంటి డాబాలపై సేంద్రియ పద్ధతిలో కూరగాయలు పండించుకోవాలన్నారు. మహిళా సంఘాల సభ్యులకు పలు అంశాల్లో అందిస్తున్న శిక్షణా కార్యక్రమాలను వినియోగించుకోవాలన్నారు. సమావేశంలో ఆర్పీలు, మెప్మా సిటీ మిషన్ మేనేజర్ సుజాత పాల్గొన్నారు.

పశువుల వ్యాధులపై అవగాహన ఉండాలి



నామవానిపాలెంలో పశువుల రక్తనమూనాలు సేకరిస్తున్న వైద్య సిబ్బంది

కాజులూరు: సీజనల్ వారీగా పశువులకు సోకే వ్యాధులు, వాటి నివారణపై రైతులు అవగాహన కలిగి ఉండాలని దుగ్గుదుర్రు పశువైద్యాధికారి చింతా శ్రీనివాస్ అన్నారు. వైద్య సిబ్బంది మండలంలోని కోలంక, కుయ్యేరు, ఉప్పుమిల్లి, నామవానిపాలెం, పల్లిపాలెం తదితర గ్రామాల్లో రైతు క్షేత్రాలకు వెళ్లి వైద్య పరీక్షల నిమిత్తం పశువుల నుంచి రక్త నమూనాలు సేకరించారు. ఆయన మాట్లాడుతూ పశువులు మూగజీవాలు కావటంతో వ్యాధులకు గురైనప్పుడు వాటి బాధను వ్యక్తపరచలేవన్నారు. రైతులే వాటి నడవడిక, ఇబ్బందుల ద్వారా వ్యాధి లక్షణాలను గమనించి వైద్య పరీక్షలు చేయించాలన్నారు. ప్రస్తుతం పశువులకు వ్యాధుల సీజన్ కావటంతో పరీక్షలు నిర్వహించి అవసరమైన వాటికి త్వరలో వ్యాక్సిన్లు వేయించాలన్నారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది సత్యనారాయణ, అరుణ్‌కుమార్, రామకోటేశ్వరరావు, దుర్గాప్రసాద్, సుష్మ, గంగారూన్సీ, పలువురు రైతులు పాల్గొన్నారు.

నిబంధనల ప్రకారమే షాపులు ఏర్పాటు చేయాలి

రామచంద్రపురం: త్రిసభ్య కమిటీ సూచించిన ప్రదేశాల్లో నిబంధనల ప్రకారమే బాణసంచా షాపులను ఏర్పాటు చేసుకుని విక్రయాలు జరపాలని ఆర్డీవో ఖాతీబ్ కౌసర్ బానో అన్నారు. దీపావళిని పురస్కరించుకుని ఏర్పాటు చేసే బాణసంచా షాపుల నిర్వాహకులపై స్థానిక ఆర్డీవో కార్యాలయంలో తహసీల్దార్, పోలీస్, అగ్నిమాపక సిబ్బంది తదితర శాఖల అధికారలతో డివిజన్ స్థాయి సమావేశం బుధవారం నిర్వహించారు. ఆర్డీవో మాట్లాడుతూ డివిజన్ పరిధిలో బాణసంచా షాపులు ఏర్పాటు చేసి అమ్ముకొనుటకు లైసెన్స్ కావాలనుకునే వారు, దరఖాస్తు చేసుకొనే వారు రూ.500 సీఎఫ్ఎంఎస్ నందు 18 శాతం జీఎస్టీతో చలానా చెల్లించి సంబంధిత తహసీల్దార్ కార్యాలంలో అనుమతి పత్రం పొందాలన్నారు. మండల స్థాయిలో తహసీల్దార్‌తో ఏర్పాటు చేసిన త్రిసభ్య కమిటీ సూచించిన ప్రదేశాల్లో మాత్రమే షాపులను నియమ నిబంధనలు పాటిస్తు ఏర్పాటు చేయాలన్నారు. ఇతర స్థలాల్లో గానీ, ప్రదేశాల్లో గానీ, తోపుడు బండ్లపై గానీ విక్రయించినా, లైసెన్స్ పొందిన వ్యక్తి ఇతరులకు బదిలీ చేసినా సదరు లైసెన్స్‌ను రద్దు చేసి వారిపై పేలుడు పదార్థాల చట్టంలోని నిబంధనల ప్రకారం తగు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కపిలేశ్వరపురం: అంగర విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు గ్రామాల్లో శుక్రవారం నిర్దేశిత సమయాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు రామచంద్రపురం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.రత్నాలరావు బుధవారం తెలిపారు. 33/11కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు, నిర్వహణాపరమైన సమస్యలను పరిష్కరించే నిమిత్తం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నామన్నారు. అంగర, కపిలేశ్వరపురం, టేకి, మాచరమట్టలు, శ్రీరామపురం, నల్లూరు, కాలేరు, సుభద్రాపురం, అచ్యుతాపురం, వడ్లమూరు, నిడసనమెట్ట, వెదురుమూడి, వల్లూరు, నేలటూరు గ్రామాల్లో ఉదయం 8 నుంచి 12 గంటల వరకూ సరఫరాకు అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని ఈఈ కోరా రు.

రెవెన్యూ గ్రామ సభలను సద్వినియోగం చేసుకోవాలి



రెవెన్యూ గ్రామ సభలో మాట్లాడుతున్న ఎంపీపీ పంపన నాగమణి

కె.గంగవరం: గ్రామాల్లో జరుగుతున్న రెవెన్యూ గ్రామ సభలను రైతులను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ పంపన నాగమణి అన్నారు. మండలంలోని యండగండిలో జరుగుతున్న గ్రామ సభలో బుధవారం ఆమె పాల్గొని మాట్లాడారు. గతంలో జరిగిన రీ సర్వేలో రైతులకు ఎటువంటి సమస్యలు వచ్చిన ఈ గ్రామ సభల్లో రాతపూర్వకంగా ఫిర్యాదు అందిస్తే రెవెన్యూ అధికారులు సంబంధిత సమస్యను పరిష్కరిస్తారన్నారు. చాలా వరకు రీసర్వేలో భూ సమస్యలను పరిష్కారం అయ్యాయని ఇంకా గ్రామాల్లో ఏమైనా సమస్యలు ఉంటే పరిష్కరించుకోవాలని కోరారు. ప్రతి గ్రామంలో ఈ రెవెన్యూ సదస్సులు జరుగుతాయని ఆమె పేర్కొన్నారు. ఎంపీటీసీ కదలి సత్యసూర్యకుమారి, ఆర్ఐ వెంకట్రావు, సర్వేయర్ పావని రెవెన్యూ సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

పొలం పిలుస్తోంది

రామచంద్రపురం రూరల్: మండలంలోని నెలపర్తిపాడులో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. మండల వ్యవసాయ అధికారి ఎస్.సత్యప్రసాద్ మాట్లాడుతూ పంట కాలువలు పూడిత తీయడం, వ్యవసాయ యంత్రాలు అవసరం మేరకు తీసుకోవడం, ధాన్యం కొనుగోలు విధి, విధానాలు తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. మండల పశు వైద్యాధికారి మేడిశెట్టి కృష్ణార్జున మాట్లాడుతూ పశువులకు వచ్చే వ్యాధులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు, సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది, అధిక సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

దుర్గమ్మ ఆలయాల వద్ద అన్న సమారాధన



వెదురుపాకలో నిర్వహిస్తున్న అన్న సమారాధన

రాయవరం: వెదురుపాకలో బుధవారం ఘనంగా అన్న సమారాధన నిర్వహించారు. శరన్నవరాత్రుల ముగింపును పురస్కరించుకుని స్థానిక దేవి సెంటర్‌లో ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో భారీ అన్న సమారాధన చేపట్టారు. వెదురుపాక, వి.సావరం, నదురుబాద, కొంకుదురు, ఆరికరేవుల తదితర గ్రామాలకు చెందిన వేలాది మంది భక్తులు అన్న సమారాధనలో పాల్గొన్నారు. రాయవరం దుర్గమ్మ తల్లి ఆలయం వద్ద కూడా దేవీ నవరాత్రులను పురస్కరించుకుని ఘనంగా అన్న సమారాధన నిర్వహించారు.

15 రోజుల్లో భూముల రీ సర్వే సమస్యల పరిష్కారం



హసన్‌బాద రెవెన్యూ గ్రామ సభలో మాట్లాడుతున్న తహసీల్దార్ వెంకటేశ్వరరావు

రామచంద్రపురం రూరల్: భూముల రీ సర్వే సమస్యల పరిష్కారం నిమిత్తం నిర్వహిస్తున్న గ్రామ సభలలో రైతులు తమ సమస్యలను తెలియజేస్తే 15 రోజుల్లోనే పరిష్కరిస్తామని రామచంద్రపురం తహసీల్దార్ మైలా వెంకటేశ్వరరావు తెలియజేశారు. మండలంలోని హసన్‌బాదలో సర్పంచ్ నాగిరెడ్డి సతీష్‌రావు అధ్యక్షతన రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో బుధవారం గ్రామ సభ నిర్వహించారు. తమ సమస్యలు పరిష్కరించాలని 35 అర్జీలు అందాయని తహసీల్దార్ తెలిపారు. మొదటిసారిగా తమ గ్రామానికి వచ్చిన తహసీల్దార్‌ని గ్రామ సర్పంచ్ సతీష్‌రావు, జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ చింతపల్లి వీరభద్రరావు దుశ్శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ మైలా నాగేశ్వరరావు, వీర్ఓలు సత్తిబాబు, పంచాయతీ కార్యదర్శి డి.శ్రీనివాసరావు, అధిక సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

పలువురికి పరామర్శలు

కపిలేశ్వరపురం: పితృవియోగంతో బాధపడుతున్న, అంగరకు చెందిన వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు పసలపూడి శ్రీనివాస్‌ను ఆయన నివాసంలో బుధవారం పలువురు పరామర్శించారు. మాజీ ఉప సర్పంచ్ వంగా శ్రీనివాస్, పార్టీ నాయకులు వాసంశెట్టి వాసు, ఆరి చిన్నా, పెద్దింశెట్టి రామస్వామి, మామిడి రాంబాబు పరామర్శించారు. ఇటీవల మృతి చెందిన 1వ గ్రామ వార్డు సభ్యుడు, జనసేన నాయకుడైన శివుడు గంగాధరం కుటుంబ సభ్యులను ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వేగుళ్ల లీలాకృష్ణ పరామర్శించారు.

వైఎస్సార్ నాయకుల పరామర్శ

మండపేట: వైఎస్సార్ సీపీ టౌన్ కోశాధికారి, పార్టీ సీనియర్ నాయకుడు అధికారి శ్రీనివాస్ తండ్రి సత్తిరాజు అనారోగ్యంతో మరణించడంతో ఆయన కుటుంబాన్ని వైఎస్సార్ సీపీ నాయకులు పరామర్శించారు. అక్కలవారి వీధి ఎదురుగా చిన్న వీధిలో ఉంటున్న శ్రీనివాస్‌ను బుధవారం పార్టీ నాయకులు పరామర్శించారు. సత్తిరాజు మరణం పట్ల వారు విచారం వ్యక్తం చేసి, కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలియజేశారు. మృతుడి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. సొసైటీ మాజీ అధ్యక్షుడు పెంకే గంగాధర్, దేవస్థానం మాజీ చైర్మన్లు లేగా వెంకటేశ్వరరావు, సూరంపూడి సత్యప్రసాద్, పార్టీ నాయకులు శివకోటి శేషసుబ్రహ్మణ్యం, దుగ్గిరాల రాంబాబు, తాడి రామారావు, పిఠాపురం సత్యనారాయణ, కాదా శ్రీనుబాబు, రామోజీ కృష్ణ పాల్గొన్నారు.

నివాస ప్రాంతాల వద్ద మద్యం షాపును తొలగించాలి



టౌన్‌హాలు ఎదురుగా ఉన్న మద్యం షాపులోకి వచ్చిన మందుబాబులతో కిక్కిరిసిన రహదారి

మండపేట: జనావాస ప్రాంతాల మధ్యలోకి మద్యం షాపు తీసుకురావడంతో లేనిపోని ఇబ్బందులు తలెత్తున్నాయని ఆ వార్డు ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వివరాల్లోకి వెళితే స్థానిక మున్సిపల్ కార్యాలయం వెనుక వైపు ఇటీవల మద్యం షాపు ఏర్పాటు చేశారు. తెల్లారిన దగ్గర నుంచి అర్ధరాత్రి వరకూ ఆ రోడ్డులో తిరునాళ్ల మాదిరిగా మారి వాహనాల రాకపోకలకు, వాహన చోదకులకు, బాటసారులకు దారివ్వకుండా బైకులు అడ్డంగా పెడుతున్నారని స్థానికులు అంటున్నారు. మహిళలు అయితే ఇంట్లో నుంచి బయటకు రాలేని దుస్థితి దాపురించిందని ఆవేదన చెందుతున్నారు. 24, 24 వార్డు ప్రజలు టౌన్ హాలు రోడ్డు మీదుగా కలువపువ్వు సెంటర్‌కు, ఏడిద రోడ్డులోకి పనుల కోసం రాకపోకలు సాగిస్తుంటారని 23వ వార్డు కౌన్సిలర్ ముక్కా లోవలక్ష్మి అన్నారు. తమ వార్డు నుంచి నిత్యం అధిక సంఖ్యలో మహిళలు మార్కెట్‌కు వెళతారని, ఇటీవల మద్యం షాపు ఏర్పాటు చేయడంతో ఆ రోడ్డు మీదుగా వెళ్లాలంటేనే భయంగా ఉంటోందని కౌన్సిలర్ ఆవేదన వ్యక్తం చేశారు. దుకాణం ఇక్కడ ఏర్పాటైన రోజు నుంచి మందుబాబులు చేస్తున్న రాద్ధాంతం మితిమీరుతోందని పలువురు మహిళలు అంటున్నారు. గంట గంటకూ ఏదో గొడవ పడుతూ, రహదారికి అడ్డంగా బైక్‌లు పార్క్ చేయడం వంటి చర్యల వల్ల చాలా ఇబ్బందికరంగా ఉంటోందని ప్రయాణికులు తెలిపారు. తమ వార్డులోని మహిళలు ఎవరికి చెప్పుకోవాలో తెలియక దిక్కుతోచని స్థితిలో ఉన్నారని కౌన్సిలర్ లోవలక్ష్మి వివరించారు. ప్రశాంతంగా ఉండే ప్రాంతం మద్యం షాపు ఏర్పాటు వల్ల అధ్వాన్నంగా మారిందని తెలిపారు. దీనిపై సంబంధిత అబ్కారీ శాఖ అధికారులు జోక్యం చేసుకుని తక్షణం అక్కడి నుంచి మద్యం దుకాణాన్ని తొలగించాలని లోవలక్ష్మి వార్డు ప్రజల తరఫున విజ్ఞప్తి చేశారు. గతంలో మాదిరి ప్రశాంత వాతావరణం నెలకొనేలా చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు.

సీఎం సహాయనిధి చెక్కుల అందజేత

మండపేట: ఇటీవల అనారోగ్యం బారిన పడి ఆస్పత్రుల్లో చికిత్స పొందిన పలువురికి ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన రూ.3.60 లక్షల చెక్కులను ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అందజేశారు. బుధవారం టీడీపీ కార్యాలయంలో బాధితులకు వాటిని అందించారు. రాయవరం పట్నాల నాగలక్ష్మికి రూ. 1.08 లక్షలు, కపిలేశ్వరపురం మండలం కోరుమిల్లికి చెందిన సుంకర మహాలక్ష్మికి రూ.1.28 లక్షలు, గవర విష్ణు నాగలక్ష్మికి రూ.1.23 లక్షల చెక్కులను అందజేశారు. జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ నల్లమిల్లి వీర్రెడ్డి, సుంకర బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా ఆటోలు నడపాలి



ఆటోడ్రైవర్లకు ట్రాఫిక్ నియమాలు వివరిస్తున్న సీఐ దొరరాజు, ఎస్సై శాస్త్రి

మండపేట: మండపేటలోని ఆటో నడిపే వారంతా ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగించకుండా వ్యవహరించాలని రూరల్ సీఐ, టౌన్ ఇన్‌చార్జ్ పీతల దొరరాజు హెచ్చరించారు. మెయిన్‌రోడ్డులోని సీఐ కార్యాలయం ఆవరణలో పట్టణ ఆటో డ్రైవర్లతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధనలపై పలు సూచనలు చేసి విధిగా పాటించాలని ఆదేశించారు. ప్రతి డ్రైవరు డ్రైవింగ్ లైసెన్సు కలిగి ఉండాలన్నారు. యూనిఫాం ధరించడంతో పాటు వాహన రికార్డు దగ్గర పెట్టుకోవాలన్నారు. ట్రాఫికు ఎటువంటి అంతరాయం కలిగించకుండా ఆటోల్లో ప్రయాణికులను ఎక్కించుకోవాలన్నారు. టౌన్ ఎస్సై హరికోటి శాస్త్రి మాట్లాడుతూ ముఖ్యంగా మద్యం సేవించి ఆటో నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం సీఐ దొరరాజు, ఎస్సై శాస్త్రి, ఏఎస్సై చిన్నారావుతో కలిసి పట్టణంలో ఆటోలు నిలిపే ప్రదేశాలను పరిశీలించారు. సమావేశంలో ఆటో యూనియన్ నాయకులు పెనుముచ్చి బాబూసుకుమార్, ముమ్మిడివరపు ఆదినారాయణ, సవరపు చంద్రయ్య, మాండ్రు శ్రీను, సన్నాల ధనరాజు, కంది శ్రీనివాస్ పాల్గొన్నారు.